నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 24 జూన్ 2025 | ADILABAD NIRMAL

## కమిటీ సభ్యులు పేదలకు ఇండ్లు ఇస్తలేరు..



ఆదిలాబాద్ పట్టణంలోని 28 వార్డులో నివాస ముంటున్న నేను కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నా. నేను పూరి గుడిసెలో ఉంటున్నా. వర్షాకా లంలో గుడిసెలోకి నీరు వస్తుంది. నాకు, నా భార్యకు ఆరోగ్యం సరిగా ఉండదు. నాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని కమిటీ సభ్యులు చెప్పారు. ఫొటోలు కూడా తీసుకుని పోయారు. కమిటీ సభ్యులను అడిగితే నీకు ఇళ్లు రాలేదని అంటున్నారు. మా వంటి పేద వారికి ఇల్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు దరఖాస్తు ఇవ్వడానికి వచ్చాము. **- షేక్ మోయిన్, బొక్కలగూడ, ఆదిలాబాద్**



## పాఠశాలను ప్రారంభించండి..

తమ గ్రామంలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలంటూ భీంపూర్ మండలంలోని డబ్బాకుచ్చి గ్రామస్తులు కలెక్టర్‌కు దరఖాస్తు ఇచ్చారు. గిరిజన గ్రామమైన డబ్బాకుచ్చిలో విద్యార్థులు లేరనే కారణంగా 15 ఏండ్ల కిందట ప్రభుత్వ పాఠశాలను అధికారులు మూసి వేశారన్నారు. ఇప్పుడు గ్రామంలో 30 మంది విద్యార్థులు ఉన్నారని, వారు ఇతర గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారన్నారు. దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, తమ గ్రామంలో మూతబడిన పాఠశాలను ప్రారంభిస్తే పిల్లలకు స్థానికంగా చదువుకునే అవకాశం లభిస్తుందన్నారు.

# ప్రజావాణికి సమస్యల వెల్లువ

**దరఖాస్తులను స్వీకరించిన అధికారులు**

- ఆదిలాబాద్‌లో 115, నిర్మల్‌లో 116 వినతులు
- త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

*ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సోమవారం ప్రజావాణిని నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు దరఖాస్తులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతులు అందజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 115, నిర్మల్ జిల్లాలో 116 దరఖాస్తులు వచ్చాయి. అధికంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తులు అధికంగా రాగా.. వీటితోపాటు ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని అర్జీలను సమర్పించారు. వినతులను పరిష్కరించిన అధికారులు సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.*

*- ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/నిర్మల్ చైన్‌గేట్, జూన్ 23*



## సోన్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

సోన్ మండలంలోని కడ్తాల్‌కు చెందిన రైతులు సోన్ తహసీల్దార్ మల్లేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భూ సమస్యల పరిష్కరించాలని సోన్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే తహసీల్దార్ మల్లేశ్ రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని, గంటల కొద్దీ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ నాయకులతో వెళ్తే పనులు చేస్తున్నాడని తెలిపారు. ఇంతేగాక ఎక్కువ మాట్లాడితే సర్వే నంబర్‌లలో రెడ్‌మార్కు వేస్తానని బెదిరిస్తున్నట్లు రైతులు తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



ప్రజావాణిలో తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న అంబుగాం గ్రామస్తులు

## యూడీఐడీ కార్డులు ఇవ్వాలి



తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు యూడీఐడీ కార్డులు ఇవ్వాలని కోరుతూ సోమవారం బాధితులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం సమర్పించారు. తాము తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. ఇంతవరకు సదరమ్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, దీంతో పెన్షన్ రావడం లేదని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలలో సదరమ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు. తమకు సదరమ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు.



ఆదిలాబాద్‌లో ప్రజావాణి ఆన్‌లైన్ కౌంటర్ వద్ద దరఖాస్తుదారులు

## సారూ.. రేషన్ బియ్యం

- లబ్ధిదారుల వేడుకోలు
- మండలంలోని ప్రజావాణిలో ఫిర్యాదు
- కలెక్టర్‌ను కలిసి విన్నవించినా అందని బియ్యం

కుంటాల, జూన్ 23 : తమకు రేషన్ బియ్యం ఇప్పించాలని కుంటాల మండలంలోని అంబుగాం వాసులు సోమవారం మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ కమల్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. మా గ్రామానికి బియ్యం తరలించే వాహనాన్ని భైంసాలో పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో తమకు బియ్యం సరఫరా ఆపడం అన్యాయమని, గ్రామంలో 50 మంది కార్డుదారుల వరకు మాత్రమే బియ్యం అందగా ఇంకా 60కి మందికిపైగా కుటుంబాలకు బియ్యం అందాల్సి ఉందని గ్రామస్తులు వాపోయారు. ఇటీవల నిర్మల్‌లో ఈ విషయమై కలెక్టర్‌కు కలిసి విన్నవించినా ఇంత వరకు పంపిణీ పునఃప్రారంభం కాలేదని, బియ్యం జారీ గడువు తేది 30 దగ్గర పడుతుండడంతో తమకు రేషన్ బియ్యం అందుతుందో లేదో అని ఆందోళన పడుతున్నామని తెలిపారు. గడువులోగా తమకు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేయాలని వారు కోరారు.

## బెల్ట్‌షాపులను మూసివేయాలి



ఖానాపూర్ పట్టణంలోని 3వ వార్డు అంబేద్కర్‌నగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు నిర్మల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల తర్వాత బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమీపంలోనే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఉందన్నారు. కాలనీవాసులు, మహిళలకు ఇబ్బందిగా ఉందని చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రొసీడింగ్స్ ఇచ్చారు.. ఇల్లు మంజూరు కాలేదంటున్నారు



అధికారులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినట్లు ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. ఎప్పుడు కట్టుకోవాలని అడిగితే మీకు ఇండ్లు మంజూరు కాలేదు అంటున్నారని ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సాయిలింగికి చెందిన సంజీవ్, లలిత ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కూలీ పనులు చేసుకుంటూ పొట్టపోసుకునే తాము నాలుగు గింజలు వేసుకుని ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని ఉంటున్నామని తెలిపారు. వానకాలంలో వర్షం నీరు ఇంటిలోకి వస్తుందన్నారు. మే 29న ఇందిరమ్మ ఇళ్లు వచ్చిందంటూ ప్రొసీడింగ్ ఇచ్చారన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో చుట్టూ తిరిగినా ఫలితం లేదని, మీకు ఇళ్లు రాదని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మంజూరైన ఇంటిని ఇతరులకు ఇవ్వకుండా పేదలమైన తమకు దక్కేలా చూడాలని కోరారు.

## బియ్యం ఇప్పించండి..



నా భార్య చనిపోవడంతో నేను ఒక్కడినే ఉంటున్నా. నా కొడుకు కుటుంబం వేరుగా ఉంటుంది. నాకు వచ్చే ఆరు కిలోల రేషన్ బియ్యం మీదనే ఆధారపడతా. మా ఊర్లో కొందరికే బియ్యం పంపిణీ జరిగింది. పేదోళ్లం.. ఇంకా తొమ్మిది రోజులే గడువు ఉందని ఊర్లో అంటున్నారు. గడువులోగా మూడు నెలల బియ్యం ఇయ్యాలి.

***- రాంజీ చౌహాన్, లబ్ధిదారు, అంబుగాం.***



నిర్మల్ కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జూన్ 23 : మండల కేంద్రంలోని మథుర కాలనీకి చెందిన గోతి చత్తర్‌సింగ్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సోమవారం ఆయన నివాసంలో అందజేశారు. ఆస్పత్రిలో శస్త్రచికిత్స కోసం ప్రభుత్వం నుంచి రూ.60 వేల చెక్కు మంజూరు కావడంతో బాధితుడికి అందించారు. అలాగే ఇచ్చోడ మండలం దరుంపూర్ గ్రామానికి చెందిన అట్కలే బాలాజీకి రూ.7,500 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, సిరికొండ సర్పంచ్ పెంటన్న, మహేందర్, ఉప సర్పంచ్ చందు, నాయకులు సురేందర్, ప్రశాంత్, గులాబ్‌సింగ్, నారాయణ, అడెల్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**పేద కుటుంబానికి ఆర్థిక సాయం**

సావర్‌గాం గ్రామానికి చెందిన రాథోడ్ ఇందల్ కుమారుడు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ బాదిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల నగదును తక్షణ సాయంగా అందించారు. ఎలాంటి సమస్య ఉన్న తనను సంప్రదించాలని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పాడు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ) : వర్క్ ఫ్రం హోం అంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ ముఠాను సోమవారం ఆదిలాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ అఖిల్ మహజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని తికమ్‌గఢ్‌కు చెందిన సౌరభ్ రాయక్వార్, రితిక్‌సేన్‌లు సైబర్ నేరగాళ్లకు కమీషన్ ఏజెంట్లుగా పనిచేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్ మెస్సేజ్‌ల ద్వారా అమాయకులను వర్క్ ఫ్రం హోం అంటూ తక్కువ సమయంలో, తక్కువ డబ్బులతో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపుతారన్నారు. రోజు రూ.2 వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదించవచ్చని నమ్మించి టాస్క్‌లు పూర్తి చేసిన వారికి కొంత డబ్బులు బాధితుల అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. టాస్క్‌లకు సంబంధించిన డబ్బులను చూపిస్తూ వాటిని తీసుకోవాలంటే ముందుగా డబ్బులు విడుతలవారీగా జమ చేయాలని అంటున్నారన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్‌కు చెందిన చెన్న శివ కుమార్ తాను మోసగాళ్ల ఊబిలో చిక్కుకుని రూ.5.03 లక్షలు నష్టపోయినట్లు 1930 ఫిర్యాదు చేశారన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రదారులతోపాటు మిగతా ముఠా సభ్యులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్‌లు, లాప్‌ట్యాప్, మూడు బ్యాంకు పాసు పుస్తకాలు, కీ బోర్డు, మానిటర్, పాన్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, జూన్ 23 : నిర్మాణంలోని కార్మికుల వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాజేంగుల రాజు అన్నారు. సంక్షేమ బోర్డు ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోరెత్తించారు. నిర్మాణ రంగంలోని కార్మికులతోపాటు ఇతర కార్మికులకు రిజిస్ట్రేషన్, క్లైమ్స్ కార్మిక శాఖ ద్వారానే జరిగేవని తెలిపారు. అయితే దానిని నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం యత్నిస్తున్నదన్నారు. దీనిని విరామించుకోవాలన్నారు. అదే విధంగా కార్మికులకు రూ.5 వేల పెన్షన్‌తో పాటు సాధారణ మరణానికి రూ.5 లక్షలు, యాక్సిడెంటల్ బెన్ఫిట్ రూ.10 లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కీర్తి రమణ, జిల్లా కోశాధికారి మహేందర్, గంగయ్య, నర్సింలు, కల్లెపెల్లి గంగయ్య పాల్గొన్నారు.




ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

## పులి సంచారం

బోథ్, జూన్ 23 : బోథ్ అటవీ రేంజ్ పరిధిలోని రఘునాథ్‌పూర్ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తుండడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం అడవిలోకి మేతకు వెళ్లిన ఆవుల మందపై దాడి చేసి దూడను చంపేసింది. అది పులా? చిరుతా? అనే నిర్ధారణ కోసం అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో మరుసటి రోజు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పులి సంచరిస్తున్నట్లుగా నిర్ధారణకు వచ్చారు. పులి సంచారంతో రఘునాథ్‌పూర్, అందూర్, నారాయణపూర్, పట్నాపూర్, మర్లపల్లి, కంటేగాం, నిగిని గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతానికి అనుకుని పొలాలు ఉండడంతో పనులు వెళ్లే కూలీలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి పొలాలకు వెళ్లొద్దని రేంజ్ అధికారి ప్రణయ్ సూచించారు.

## నైపుణ్యాభివృద్ధికి డ్యూటీ మీట్‌లు దోహద పడుతాయి

ఎదులాపురం, జూన్ 23 : పోలీసుల నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా డ్యూటీ మీట్లు దోహదం చేస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో రెండో సారి నిర్వహిస్తున్న డ్యూటీ మీట్‌ను ఎస్పీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. స్వయంగా ఫింగర్ ప్రింట్స్ తీసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కేసుల దర్యాప్తు, పరిశోధన, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అంశాల్లో శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు ప్రణయ్ కుమార్, మొగిలి, వెంకటేశ్వరావు, రిజర్వ్ సీఐలు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, టి మురళి పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన ఆదిలాబాద్ జిల్లా ఆహార భద్రతాధికారి శ్రీధర్

## జాతీయ శిక్షణలో శ్రీధర్

ఎదులాపురం, జూన్ 23 : భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ(ఎఫ్ఎస్ఎస్ఏఐ), కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ నెల 23 నుంచి 27 వరకు కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాతినిధ్యంగా ఆదిలాబాద్ జిల్లా ఆహార భద్రతాధికారి శ్రీధర్ హాజరయ్యారు. నియమిత అధికారి, ఆహార భద్రతాధికారుల కోసం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన ఐదు రోజుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, కేరళ, తమిళనాడు, లక్షద్వీప్, మేఘాలయ రాష్ట్రాల ఆహార భద్రతాధికారుల సాంకేతిక పరిజ్ఞానం, అమలు నైపుణ్యాలు, నియంత్రణ సామర్థ్యాలను మెరుగుపర్చడం లక్ష్యమని జిల్లా ఆహార భద్రతాధికారి శ్రీధర్ తెలిపారు.